ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 24.05.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈ రబీ సీజన్ లో ఇప్పటివరకు 51 లక్షల టన్నుల ధాన్యం కొనడం ద్వారా , రైతులకు 45వేల కోట్ల రూపాయలు చెల్లించినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

2. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 1800 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

3. కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వం వల్లే రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటాలో నష్టం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపిస్తూ , ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

4. రాష్ట్రంలో రాబోయే 3 రోజులపాటు ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు ఉండదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలో 8 వేల 575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు 45వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన మంత్రి. . తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దని సూచించారు . వర్షాలతో ధాన్యం తడిచినా కొనాల్సిందే నని స్పష్టం చేశారు. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి.. వాటికి కొరత లేద ని మంత్రి తెలిపారు.

డెస్క్

తుమ్మల

మొక్క జొన్న లను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన 4వేల కోట్ల రూపాయలకు అదనంగా మరో 1800 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి కేటాయించారని చెప్పారు. తక్షణమే 11 వందల కోట్ల రూపాయలను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. పొద్దుతిరుగుడు పంట 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు.

డెస్క్

హిల్ట్ పాలసీ ప్రారంభం

హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సచివాలయంలో ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు .. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ ఫార్మేషన్ పాలసీ' ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. నగర కోర్ అర్బన్ ప్రాంతంలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను సులభంగా, పారదర్శక పద్ధతిలో ఇతర ప్రాంతాలకు తరలించడమే ఈ నూతన విధానం ముఖ్య ఉద్దేశ్యం. పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా , పర్యావరణహిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఈ ఫ్రేమ్‌వర్క్ ను రూపొందించారు. భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్‌ను మరింత పచ్చగా , స్వచ్ఛంగా మార్చడమే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

Ptc, hyd

సీఎంకు లేఖ

కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వం వల్లే రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటా వృథా అవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. ట్రిబ్యునల్ కేటాయించిన 968 టీఎంసీల నికర జలాలను వాడుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. కేంద్రం అనుమతులిచ్చిన కాళేశ్వరం , సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు వందల టీఎంసీల నీటిని కోల్పోతున్నారని లేఖలో ప్రస్తావించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని ప్రాజెక్టులపై తక్షణ శ్రద్ధ పెట్టాలని లేఖలో పేర్కొన్నారు.

హైదరాబాద్ పీటూసీ

నీట్.. ధర్నా

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ స్కామ్‌కు వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఇందిరా గాంధీ విగ్రహం నుండి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ , ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ తో సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా NSUI జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని , పేపర్ లీకేజ్ కారణంగా వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీఎస్

బస్సులో భరోసా

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల రక్షణ కోసం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది . ప్రమాదాలు , చోరీలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి కొత్త వ్యూహాన్ని అమలులోకి తెచ్చారు. "బస్సులో భరోసా" పేరిట రూపొందించిన కార్యక్రమాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు ను ప్రారంభించారు. ఈ సరికొత్త భద్రతా వ్యవస్థ కింద ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో ఈ అత్యాధునిక సీసీ

కెమెరాలను అమర్చారు. బస్సు ఎక్కే ప్రతి వ్యక్తి ముఖ కదలికల నుంచి ప్రయాణంలో జరిగే ప్రతి చిన్న యాక్టివిటీ వరకు అన్నీ ఇందులో రికార్డు అవుతాయి. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు సాధించే ఫలితాలను బట్టి , రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులకు దీనిని విస్తరించడానికి ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

డెస్క్

ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో  రాబోయే 3 రోజులపాటు ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు ఉండదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ తర్వాత 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతుందని పేర్కొంది. అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఇవాళ, రేపు వడగాలులు వీచే అవకాశం ఉందని ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

డెస్క్

సజ్జనార్- ఏఐ కాప్‌రైటర్

పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషా

పరమైన ఇబ్బందులు కలగకుండా , వారి ఫిర్యాదులను త్వరితగతిన  నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా  'ఏఐ కాప్‌రైటర్' అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను  హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ ఆవిష్కరించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా  .. బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను పోలీసులు తక్షణమే రికార్డు చేసి, అనువదించుకోవచ్చు.

డెస్క్

బీర్ల ఐలయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా రామాజీపేట గ్రామంలో ఉన్న పత్తి విత్తనాల కంపెనీ భవనాన్ని వడ్ల గోదాంగా మార్చేందుకు ప్రభుత్వ విప్  ,  ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఈ రోజు పరిశీలించారు. రైతులు ధాన్యం నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే అధికారులతో ప్రత్యేకంగా చర్చించి గోదాం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ గోదాం ఏర్పాటు వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ధాన్యాన్ని సమయానికి విక్రయించే అవకాశం లభిస్తుందని అన్నారు.

పీటీసీ, యాదాద్రి

మహిళా వారోత్సవాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రేపటి నుంచి ఈ నెల 30 వరకు జనగామ జిల్లాలో మహిళా సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సెర్ప్ –మెప్మా, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ ల ఆధ్వర్యంలో వీటిని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పీటీసీ, జనగామ

సిరిసిల్ల కలెక్టర్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ , వాహనాల్లో లోడింగ్ , రైస్ మిల్లులు , గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు , తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంచడం, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడంపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దార్లు అందుబాటులో ఉండి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు తనిఖీ చేయాలని సూచించారు.

పీటీసీ, సిరిసిల్ల

ఎల్ఆర్ఎస్

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద గతంలో 1,000 రూపాయలు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో, మున్సిపల్ యాక్ట్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి LRS ఫీజు, ఇతర చార్జీల పూర్తి చెల్లింపుపై 25శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈనెల 31 వరకు అవకాశాన్ని ప్రభుత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు.

పీటీసీ, సిరిసిల్ల

సంగారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రేపటి నుండి ఈ నెల 30 వరకు జిల్లాలో "మహిళా ఆర్థిక వారోత్సవం" నిర్వహించనున్నట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి , స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ , స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా.. మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల ప్రదర్శనలు , బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు , రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన , మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పీటీసీ, సంగారెడ్డి

నిరంజన్ రెడ్డి కామెంట్స్

వరి ధాన్యం, మొక్క జొన్న కొనుగోలులో ప్రభుత్వ వైఖరితో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ప్రజల అగ్రహావేశాలకు గురికాకముందే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు రైతుల నుంచి సుమారు 10 కిలోల తరుగు తీయడం అన్యాయమన్నారు.

వనపర్తి పీటూసీ